
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 11 । మే । 2023



సంచుల కొరత రానివ్వం

రైతులను ఆదుకునేందుకు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో గోనె సంచుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. 8లో



బ్రహ్మోత్సవాలు

గోకుల తిరుమల పారిజాతగిరిలో రేపటి నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో ▸

ఉక్కుపాదం



గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్ట మైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులను అణచివేయాలని డీఐజీ జీవీజీ అశోక్‌కు మార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని అమరావతి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం వినతి పత్రం అందించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఏఎంసి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు కూడా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



భీమవరం సీతా పాలిటెక్నిక్ వద్ద పరీక్షా కేంద్రం వివరాలు తెలియచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో పాలిసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 6,462 మంది విద్యార్థులు హాజరుకావాల్సివుండగా 5,985 మంది హాజరయ్యారని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ ఫణీంద్రప్రసాద్ చెప్పారు. భీమవరం పట్టణంలోని 6 పరీక్షా కేంద్రాల్లో 2,112 మంది విద్యార్థులు హాజరుకావల్సివుండగా 1,916 మంది హాజరయ్యారు. తణుకులోని 8 కేంద్రాల్లో 2,159 మంది, నరసాపురంలోని 4 కేంద్రాల్లో 843 మంది, తాడేపల్లిగూడెంలోని ఒక కేంద్రంలో 1,070 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఫణీంద్రప్రసాద్ చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు పరుగుపరుగున వచ్చి పరీక్షకు హాజరయ్యారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): గత మూడు నెలలుగా ఏపీఎస్ ఆర్టీసీ నడిపిన అరుణాచలం స్పెషల్ బస్సులకు భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో మరిన్ని సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి తెలిపారు. ప్రతి నెల పౌర్ణమికి ముందు రోజు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి బస్సులు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం చేరుకొని గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి వస్తాయని అన్నారు, ప్రయాణికుల విశ్రాంతి, ఇతర అవసరాల కోసం చక్కటి సదుపాయాలు ఉన్న చోట అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. యాత్రకు హైటెక్ వీడియో కోచ్ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని డిపోల నుంచి అరుణాచలం స్పెషల్ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని చెప్పారు.

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గత 40 రోజులకు నగదు రూపేణా శ్రీవారికి రూ.3,70,03,230 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 804 గ్రాముల బంగారం, 10.705 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ. 500 నోట్లు ద్వారా రూ.18,500 లభించినట్టు చెప్పారు.

జోరుగా దాళ్వా మాసూళ్లు

- జిల్లాలో 67 శాతం పూర్తి
- తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో 95 శాతంపైగా పూర్తి
- ఈనెల 20 కల్లా మాసూళ్లు పూర్తయ్యే అవకాశం



భీమవరం మండలంలో మాసూళ్లు చేస్తున్న దృశ్యం



మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా మాసూళ్లు వేగంగా సాగుతున్నాయి. గత వారం బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తణం కారణంగా అకాల వర్షాలతో రైతులు బెంబేలెత్తిపోయారు. అనేకచోట్ల మాసూళ్ల చేసిన ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో ఒబ్బిడి చేయడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. తడిచిన ధాన్యం ఎండబెట్టినా మిల్లర్లు బియ్యంలో నూకశాతం అధికమంటూ రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో జిల్లా అధికార యంత్రాంగం రంగంలోకి దిగి ఎక్కడికక్కడ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే రైతులను ఇబ్బందులకు గురిచేసిన పాలకొల్లు, తణుకు, పెనుగొండ, గణపవరం, ఇరగవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లోని 9 రైస్‌మిల్లులపై కలెక్టర్ కన్నెర్రజేసి మిల్లులను సీజ్ చేయడంతో మిగిలిన మిల్లర్లు అప్రమత్తమై మిల్లులకు చేరిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకున్నారు.

1.54 లక్షల ఎకరాల్లో దాళ్వా మాసూళ్లు పూర్తి

జిల్లాలోని 20 మండలాల్లో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా నాట్లు వేయగా ఇప్పటి వరకు దాదాపు 1.54 లక్షల ఎకరాల్లో పంట మాసూళ్లు పూర్తయింది. దీనిలో తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో 95 శాతం పూర్తికాగా ఆచంట నియోజకవర్గం మాసూళ్లలో బాగా వెనుకబడి ఉంది. పెనుమంట్రలో 39 శాతం, ఆచంటలో 30, పెనుగొండలో 40 శాతం మాత్రమే మాసూళ్ల చేయగలిగారు. మూడు మండలాల్లో నాట్లు బాగా ఆలస్యంగా వేయడమే పంట చేతికి రావడానికి కారణం.

20కల్లా మాసూళ్లు పూర్తి



జిల్లాలో ఇంతవరకు దాదాపు 67 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడ్డా ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతన్నలు పంట మాసూళ్లలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రైస్ మిల్లర్లు కూడా వేగంగా ధాన్యాన్ని దింపుకోవడంతో గట్టుకు చేరిన ధాన్యం వెంటనే పట్టుబడి చేస్తున్నారు. ఈనెల 20 నాటికీ జిల్లా అంతా దాదాపు మాసూళ్లు పూర్తయ్యే అవకాశముంది. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఎక్కువగా ఎండబెట్టకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

వరి కోత యంత్రాలకు గిరాకీ

గత నాలుగు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాలకొల్లు, భీమవరం, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. రైతులు ఎక్కువ శాతం వరి కోత యంత్రాలపై ఆధారపడడంతో వాటికి గిరాకీ ఏర్పడింది, పంట మాసూళ్లకు యంత్రాలకు గంటకు రూ.2,600 వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు వరి పడిపోవడంతో కోతకు ఎక్కువ సమయం పడుతుందని దీనివల్ల కోత ఖర్చు ఎకరాకు రూ.1,500 వరకు పెరుగుతోందని అంటున్నారు. వర్షం ఇబ్బంది లేకుంటే సుమారు 10 రోజుల్లో మాసూళ్లు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు.

ఈ- స్టాంపింగ్ చట్టబద్ధమే



రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ కే.అబ్రహామ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్టాంపు పేపర్లే అక్కర్లేదని, ఈ- స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డీఐజీ కే.అబ్రహాం తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌చే ఈ-స్టాంపింగ్ విధానాన్ని ఇటీవలే ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ-స్టాంపింగ్ విధానంలో ప్రజలు తమకు అవసరమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు పొందవచ్చన్నారు. ఈ-స్టాంపింగ్ ద్వారా వేసిన స్టాంపులు, సాధారణ నాన్ జ్యుడిషియల్ బాండు పేపర్లతో సమానమైన చలామణీ ఉన్నాయన్నారు. వీటిని దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. ఈ- స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం లైసెన్సుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటే, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తుందరన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఏలూరు, భీమవరం రిజిస్ట్రేషన్ జిల్లాల్లో విస్తరించిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రజల కోసం నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పది, ఇరవై, యాభై, వంద రూపాయల ముఖవిలువ గల స్టాంపులు ఆయా సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల్లోని కౌంటర్లలోనూ, అధీకృత స్టాంపువెండర్ల వద్ద ఇవి అమ్మకానికి ఉన్నాయన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో ప్రజా సమస్యల పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, భీమవరం: ఫిర్యాదుల పరిష్కారంతో ఫిర్యాదారుడు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించడంతోపాటు అదనంగా జగనన్నకు చెబుదాం పరిష్కార వేదికను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యలకు మెరుగైన, నాణ్యమైన పరిష్కారం జగనన్నకు చెబుదాంలో లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యను 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియచేస్తే నేరుగా సీఎంఓలో ఫిర్యాదును నమోదు చేసుకొని ఐడీ కేటాయిస్తారని దాంతో ఎప్పటికప్పుడు అర్జీ స్టేటస్ ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదుదారులకు తెలియచేస్తారన్నారు. అంతేగాకుండా సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందింది లేనిది తెలుసుకుంటారన్నారు. ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ చేసి తిరిగి సంబంధిత అధికారికి పంపిస్తారన్నారు. దీని ద్వారా అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. స్పందనలో పరిష్కారం కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్జీదారులు జగనన్నకు చెబుదాంలో సమస్యను నమోదు చేసుకోవచ్చన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతున్నాయని, 2.23 లక్షల ఎకరాలలో దాళ్వా వరి సాగుచేయగా ఇప్పటివరకు 1.50 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తి అయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 6.4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం కాగా ఇంతవరకు 3.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులకు రూ.713 కోట్లు చెల్లించాల్సివుండగా ఇప్పటి వరకు రూ. 340 కోట్లు చెల్లించామన్నారు. ప్రతికూల వాతావరణంలో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయడానికి జిల్లా, మండల స్థాయి కమిటీలను నియమించినట్లు చెప్పారు. రైతుల ఇబ్బందులను తక్షణం పరిష్కరించడానికి అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటుచేసి తగినన్ని గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలోని 200 రైసుమిల్లులను సీసీ కెమెరాలు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్న ఫిర్యాదులతో 9 మిల్లులను సీజ్ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్, డీఎల్‌డీఓ కేసిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



తణుకులో సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి తదితరులు

తణుకు అర్బన్: సంక్షేమ పథకాల అమలుతో ప్రజలను అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలబడాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం 2023–24 సంవత్సరంలో అమలుచేసే వివిధ సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను మంత్రి కారుమూరి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యానారాయణ, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం జిల్లా కేంద్రంలో, జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల లోపు పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం హెచ్‌ఆర్ఏ(ఇంటి అద్దె అలవెన్స్) 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడంపై భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ ఎస్.శివశంకర్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, ఏపీఆర్ఎస్ఏ కలెక్టర్ కార్యాలయ చైర్మన్ వై.దుర్గా కిషోర్, జాయింట్ సెక్రటరీ వీవీ పెద్దిరాజు, కార్యాలయ నాయకులు పి.జగన్‌మోహన్, సాంబశివరావు తదితరులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

- వారం రోజుల్లోనే ధాన్యం సొమ్ములు అందజేత
- కల్లాల్లో ధాన్యం పరిశీలించిన మంత్రులు కొట్టు, కాకాని, కారుమూరి



అలంపురంలో కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి



మండపాకలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: రైతులకు సకాలంలో సొమ్ములు అందచేసి రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిలిచారని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. పెంటపాడు మండలంలోని అలంపురం గ్రామ రైతులను బుధవారం సాయంత్రం కలిసి మాట్లాడారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సొమ్ములు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కళ్ళాల్లో పరిశీలన చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరిస్తున్నారని చెప్పారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో తన స్వార్థం కోసం రైతులను కలిసి అవాస్తవాలు చెప్పడం చంద్రబాబు దురీ్నతిని తెలియచేస్తుందన్నారు. చంద్రబాబు పులకేసి మాదిరి వేషాలు వేయడం పట్ల ప్రజలు నవ్వుతున్నారన్నారు. 14 సంవత్సరాలు పాలన చేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఎందుకు ఇవ్వలేదని చంద్రబాబును సూటిగా ప్రశ్నించానని కొట్టు గుర్తు చేశారు. రైతులను ఆదుకొన్న ప్రభుత్వం నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు బీమా చెల్లించిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అన్నారు. పంటలు నష్టపోతే ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రైతులను జగన్ ఆదుకున్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో రైతులకు సొమ్ములు అందచేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు అందచేయడంతో ప్రభుత్వం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తుందన్నారు.

రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలి: కాకాని

మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయంలోను రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమర్థతను ప్రజలు గమనిస్తున్నారు. రైతులకు ఎలాంటి కష్టం వచ్చిన సకాలంలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులను ఆదుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. రైతులు సమస్యలను తెలుసుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లను, మంత్రులను సమాయత్తం చేశారన్నారు. పంటనష్టపోయిన రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. నష్టపోయిన పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ, తేమశాతం ఎక్కువగా ఉన్నా, రంగు మారినా కొనుగోలు చేయాలని విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులను ఆదుకొన్న దాఖలాలు లేవన్నారు. చంద్రబాబు హయాంలో రెండేళ్లపాటు ఇన్‌పుట్ సబ్సిడీ వేయలేదని రైతులకు ఈ విషయం స్పష్టంగా తెలుసన్నారు. విత్తనాల పంపిణీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అంశాలకు సంబంధించి రూ.5 వేల కోట్ల బకాయిలు పెట్టి దిగిపోయిన ప్రబుద్ధుడు చంద్రబాబు అని విమర్శించారు. రైతులు నష్టపోవాలి, రైతులను రెచ్చగొట్టాలి,జగన్‌పై వ్యతిరేకతను సృష్టించాలని దుర్బుద్ధితో రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. జగన్మోహనరెడ్డి స్పందిస్తాడని తెలిసి చంద్రబాబు ముందుగానే పరుగెడుతున్నాడన్నారు. చంద్రబాబు ఎంత ప్రయత్నించినా అతని ఆటలు సాగవన్నారు.

చంద్రబాబుది మొసలి కన్నీరు

తణుకు టౌన్: ప్రకృతి వైపరిత్యాల సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రతిపక్ష పార్టీ నాయకులు రాజకీయాల కోసం రైతులను వాడుకోవడం ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు అలవాటైపోయిందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం మండపాకలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. పొలంలో ఉన్న పంటకు నష్టం జరిగితే నిబంధనల ప్రకారం సబ్సిడీ చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఈ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విత్తనాల కోసం సేకరించిన నమూనాలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని కొలిచే యంత్రాల పనితీరుపై ఆరా తీశారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టీ శివరామప్రసాద్, జిల్లా సహకార అధికారి రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ భరణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగుల వ్యవహారంపై విచారణకు ఆదేశం

తణుకు: విద్యుత్ శాఖలోని నకిలీ ఉద్యోగుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఎస్ఈ సాల్మన్‌రాజును ఆదేశించారు. నకిలీ సర్టిఫికెట్లతో పాటు ఒకరి సర్టిఫికెట్లు మరొకరు దాఖలు చేసి దొడ్డిదారిన ఉద్యోగాలు పొందారంటూ.. నకిలీ ఉద్యోగుల వ్యవహారంపై గత నెల 23న సాక్షి దినపత్రిలో విద్యుత్ శాఖలో నకిలీలు శీర్షికతో కథనం ప్రచురితమైంది. సాక్షి కథనం విద్యుత్ శాఖలో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విద్యుత్ శాఖలో ఉద్యోగులుగా కొనసాగుతున్న నకిలీల స్థానంలో అన్ని అర్హతలు ఉండి కుంభకోణం వెలికితీయడానికి ప్రయత్నిస్తున్న బాధితులు ఇటీవల ఏలూరు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. విషయాన్ని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దృష్టికి తీసికెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఫిర్యాదుపై విచారణ చేసి పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

రిజిస్ట్రేషన్ సిబ్బందిపై చర్యలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి వ్యవహారంలో సంబంధిత అధికారులు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ కే అబ్రాహామ్ తెలిపారు. ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కేసులో సీనియర్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.50 వేలు లెక్క లేని సొమ్ము లభించిన వ్యవహారంలో సంబంధిత నరసాపురం సబ్ రిజిస్ట్రార్ ఎం.వీరభద్రరావును ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఆడిట్ విభాగానికి, సీనియర్ అసిస్టెంట్ పీ.శరాబంధురాజును భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిపాలనా విభాగానికి బదిలీ చేసినట్లు తెలిపారు. నరసాపురం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వీ.సురేష్‌ను నియమించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

లక్కవరంలో కొండ చిలువ హతం



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పంట పొలాల్లో వరి కోతలు చేస్తున్న సమయంలో భారీ కొండచిలువ కంటపడింది. దీంతో పనిచేస్తున్న రైతులు, కూలీలు అక్కడ నుంచి పరుగులు తీశారు. ఎంతసేపటికి కొండచిలువ వెళ్లకపోవడంతో కర్రలతో కొట్టి హతమార్చారు. స్థానిక ప్రజలు కొండచిలువను చూసేందుకు తరలివచ్చారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన డీఎస్సీ-98 టీచర్స్



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తమకు ఉద్యోగాలు కల్పించడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఎస్సీ-98 క్వాలిఫైడ్ టీచర్ల అసోసియేషన్ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఉద్యోగాలు పొందిన నాయకులు, సభ్యులు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. రెండున్నర దశాబ్దాలుగా టీచర్ ఉద్యోగం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు సమావేశం సంతాపం తెలిపింది. నాయకులు మాట్లాడుతూ 1998 డీఎస్సీలో మిగిలిన 112 మందికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఇటీవల ఉద్యోగాలలో చేరిన టీచర్లకు రెగ్యులర్ టీచర్ల మాదిరిగానే 12 నెలలు జీతం ఇప్పించాలని కోరారు. ఎంతో ఉత్సాహంతో ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకే ఉద్యోగ విరమణ పొందడం బాధకరమని, వారి సర్వీసును కూడా 62 ఏళ్లకు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. త్వరలో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పి.బెనర్జీ, కె.విజయ, పి.నాగవల్లి జి.ఆనందకుమారి, కె.రమాప్రభ, ఎం.సుల్తానా, జి.బాలసరస్వతి కె.రఘుపతి రావు, ఎంపీ రమణయ్య, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోపీజనలోల.. గోవర్ధనోద్ధార

- భక్తుల అభీష్టాలు తీర్చే దైవం పారిజాతగిరివాసుడు
- 12 నుంచి పారిజాతగిరి ఆలయంలో బ్రహ్మోత్సవాలు
- 15న కల్యాణోత్సవం, 16న గరుడోత్సవం, ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం: భక్తుల అభీష్టాలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతూ భక్తులతో నిత్యపూజలందుకుంటున్నాడు గోకుల తిరుమల పారిజాతగిరిలో కొలువైన శ్రీవెంకటేశ్వరస్వామి. తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు సైతం ఇక్కడ శ్రీ గోకుల తిరుమల పారిజాతగిరిలో నిర్వహిస్తున్నారు. దీంతో పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానమంతా ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. జాతీయ రహదారి (516డి)ని ఆనుకుని ఆహ్లాదకరమైన పరిసరాలతో ప్రశాంత వాతావరణంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.

చరిత్ర ఇదే..

చిట్టియ్య అనే భక్తునికి వేంకటేశ్వరుడు కలలో కనిపించి జంగారెడ్డిగూడెంకు ఉత్తరాన ఉన్న కొండల్లో తన పాదాలు వెలుస్తాయని, ఆ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించాలని తెలిపారు. ఆ విధంగా చిట్టియ్య అన్వేషించగా, ఉత్తరం వైపున ఉన్న ఏడు కొండలలో 6వ కొండపై పారిజాతగిరి వృక్షం కింద స్వామి వారి పాదాలు గల శిలను గుర్తించి అక్కడ చిన్న ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి భక్తుల అభీష్టాలు తీర్చుతూ ఆలయం దినదినప్రవర్ధమానమైంది. పాడిపంటలు కలిగిన ప్రదేశం కావడంతో గోకులం అని, పారిజాతగిరి వృక్షాలు కొండపై ఉండటంతో పారిజాతగిరి అని, వేంకటేశుడు కొలువై ఉన్నందున తిరుపతి అని గోకుల తిరుమల పారిజాతగిరిగా ప్రసిద్ధిగాంచింది.



శ్రీవెంకటేశ్వరస్వామి



శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం



హైవే నుంచి వచ్చే దారిలో ఆలయ ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఆర్చ్

తిరుమల తరువాత ఇక్కడే..

తిరుమలలో ఏడుకొండలపైన వెంకటేశ్వరుడు వెలవగా, పారిజాతగిరిలోనూ ఏడు కొండలలో ఒక కొండపై పారిజాతగిరి వాసుడు పాదపద్మాలు అవతరించాయి. దీంతో అప్పటి నుంచి ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. పారిజాతగిరి వాసుడికి ఎదురుగా గరుడకొండ ఉంది. ఏడుకొండల్లో శేషాద్రి, వృషాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి, వృషభాద్రి ఏడుకొండలు ఇక్కడ ఉన్నాయి.

ప్రదక్షిణ విశిష్టత

గిరి ప్రదక్షిణతో పుణ్యఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుడు వెలసిన ప్రదేశానికి విశిష్ట ప్రాధాన్యత ఉంది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, కార్యదర్శి కాకాని శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు రూ.30 లక్షలు వెచ్చించి గోకుల పారిజాతగిరి ఆరు కొండల చుట్టూ గిరిప్రదక్షిణ తాత్కాలిక రోడ్డును నిర్మించారు. దీనికి కొంత మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కూడా ఆర్థిక సహాయం అందింది. కొండ చుట్టూ ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే త్వరలో దాతల సహకారంతో పూర్తిస్థాయి శాశ్వత రోడ్డును నిర్మించనున్నారు. ఈ తరహా గిరి ప్రదిక్షణ సుప్రసిద్ధ దేవాలయాలు అరుణాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తిలో మాత్రమే ఉన్నాయి. కాగా ఈ ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం, మే నెలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి తరహాలోనే పారిజాతగిరికి కూడా మెట్ల మార్గం ఉండటం విశేషం.

12 నుంచి బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. తొలి రోజు సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు శేషవాహన సేవ, 14వ తేదీ రాత్రి 8 గంటలకు హనుమంతవాహన సేవ, 15వ తేదీ ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు గరుడోత్సవం (గ్రామోత్సవం), 17వ తేదీ ఉదయం 9 గంటలకు చక్రస్నానం, రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, 9 గంగటలకు ధ్వజారోహణం, 18న ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 12వ తేదీ నుంచి 18 వరకు వారం పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నాం. 15వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఆలయ మాఢవీధుల్లో అర్చకుల వేద మంత్రాల నడుమ స్వామి వారికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నాం.

– ఎం.రాంబాబు, ఈఓ, గోకుల తిరుమల పారిజాతగిరి, జంగారెడ్డిగూడెం

గోనె సంచుల కొరత రానివ్వం

- ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు
- సొంత ఖర్చుతో రైతులకు సంచుల పంపిణీ ప్రారంభం



వరంగల్ నుంచి లారీలో వచ్చిన గోనె సంచులు

పెనుగొండ: అకాల వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు తన సొంత ఖర్చులతో గోనె సంచుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మే ఒకటో తేదీ నుంచి కురిసిన వర్షాలతో ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులకు ఒకేసారి గోనె సంచులు అవసరమయ్యాయి. దీంతో వాటికి కొరత ఏర్పడింది. ఎప్పుడూ రైతులకు అండగా నిలిచే శ్రీరంగనాథరాజు వారి సమస్యలను తెలుసుకుని రూ.2 కోట్లతో దాదాపుగా 10 లక్షల సంచులను వరంగల్, ఏలూరు ప్రాంతాల నుంచి కొనుగోలు చేశారు. వీటిలో కొంత మేర సంచులు రావడంతో ఆచంటలో రైతులకు ముందుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. నియోజకవర్గంలో ఎక్కడా సంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను శ్రీరంగనాథరాజు ఆదేశించారు. నిత్య పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు రైతులకు సంచులు అందించి కోసిన ధాన్యాన్ని నేరుగా మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారులు మిల్లుల వద్దకే వెళ్లి సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని సూచించారు. తొలివిడతగా ఆచంట, పోడూరు మండలాలకు గోనే సంచుల పంపిణీని తూర్పుపాలెం కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. అవసరమైతే మరిన్ని సంచులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కేవలం విమర్శలతో కాలం వెళ్లబుచ్చే ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలను పట్టించుకోవద్దని రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి సొంత ఖర్చులతో గోనే సంచులు ఏర్పాటు చేసిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం



ఉండి: ఆరేడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నూజివీడు: గొల్లపల్లిలో మేనమామ ఇంటికి వచ్చిన ఓ యువతి ఈనెల 6న అదృశ్యమైన ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడలోని నైజాంపేటకు చెందిన 21 ఏళ్ల యువతి నూజివీడు మండలం గొల్లపల్లిలోని మేనమామ ఇంటికి వచ్చింది. అయితే ఈనెల 6న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద విచారించినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఎవరికైనా యువతి ఆచూకీ తెలిస్తే 94407 96440 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అసాంఘిక శక్తులను అణచివేయండి

- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- ఏడు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్‌లో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఉంచి అణచివేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరులోని రేంజ్ కార్యాలయం నుంచి ఆయన బుధవారం ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సమాజానికి చేటు చేసే అరాచక శక్తులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దిశ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ గ్రామ సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) సేవలను వినియోగించుకుంటూ మహిళలపై నేరాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తలు వహించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సైబర్ కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శాంతిని నెలకొల్పేలా చూడాలన్నారు. ఈనెల 13న మెగా లోక్ అదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులకు సంబంధించి కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులను డీఐజీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్, అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవి ప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, అదనపు ఎస్పీలు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు పాల్గొన్నారు.

రొయ్యల లారీ చోరీ కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

కాళ్ల: పెదఅమిరంలో రొయ్యల లారీ చోరీ కేసును ఛేదించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ చెప్పారు. కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఆకివీడు సర్కిల్ పరిధిలోని కాళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 30వ తేదీన జరిగిన రొయ్యల లోడు లారీ చోరీ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టి భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ పర్యవేక్షణలో ఆకివీడు సర్కిల్ సీఐ ఎం.గీతా రామకృష్ణ భీమవరం క్రైమ్ పార్టీ సీఐ ఆకుల రఘు, కాళ ఎస్సై ఏజీఎస్ మూర్తి, క్రైమ్ బ్రాంచ్ సహకారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామానికి చెందిన చెన్ను లక్ష్మీ గణపతి అలియాస్ గణేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం రాజుపేట గ్రామానికి చెందిన మల్లి సాగర్‌రెడ్డి అలియాస్ సాగర్‌లను మొగల్తూరు బస్‌స్టాండ్ సెంటర్ గాంధీ బొమ్మ వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. గుప్త నిధులు, రైస్ పుల్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడి అప్పులపాలై వాటిని తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ దొంగతనం చేసినట్లు విచారణలో తేలింది. వీరిచ్చిన సమాచారం ఆధారంగా చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వదిలిపెట్టిన లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలం కనికాపురం గ్రామంలో ఉన్న మరో ఇద్దరు నిందితులు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు గ్రామం,పాతూరు ముస్లిం బజారుకు చెందిన ఎస్‌కే మస్తాన్ వలీ అలియాస్ మస్తాన్, జీలుగుమిల్లి మండలం కనకాపురం గ్రామానికి చెందిన మక్కెళ్ల ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులంతా పెదఅమిరం గ్రామంలో ఆర్‌సీ ఆక్వా ట్రేడర్స్ ఆఫీసు తాళం బద్దలు కొట్టి అందులో లారీ తాళాలు దొంగిలించి రొయ్యల లోడుతో ఉన్న లారీని దొంగతనం చేసినట్లు తెలిపారు. బాక్స్ టైప్ లారీని, రొయ్యల లోడు చేసుకునే ఖాళీ 120 ప్లాస్టిక్ ట్రేలు, రొయ్యలు అమ్మేయగా వచ్చిన సొమ్ములో నిందితులు వద్ద ఉన్న రూ.4.07 లక్షల నగదు, నిందితులు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో చోరీ సొత్తు కొనుగోలు చేసినవారిపై కూడా విచారణ చేసి చర్య తీసుకుంటామన్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. డీఎస్పీ శ్రీనాథ్, సీఐలు రఘు గీతా రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపకులపతి జానకిరామ్‌కు మంత్రి కాకాని పరామర్శ



ఉపకులపతిని పరామర్శించిన మంత్రి కాకాని

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్‌ను వెంకట్రామన్నగూడెం విశ్వ విద్యాలయం ప్రాంగణంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉషాశ్రీకి నివాళులర్పించారు.

17న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆకివీడు: స్థానిక సంతనగర్ ఏరియాలో జై భీమ్ యూత్, స్థానిక పెద్దలు ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున ఈ నెల 17న ఆవిష్కరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి రమేష్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నాయకులను సమీకరించుకుని విగ్రహం ఏర్పాటు చేసుకున్న యూత్ వారిని అభినందించారు. గుండుగొల్లు ధనరాజ్, పెద్దిరాజు, కటికితల రాజారావు, మేరుగు దేవమనస్సు, మద్దా జ్ఞానరాజు, మోటుపల్లి రాజు, కోయ్యే శ్రీను, చవల సుబ్రహ్మణ్యం, కిరణ్, పండు, శ్రీను పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

సాక్షి, భీమవరం: గతేడాది సెప్టెంబర్‌లో మోటార్ సైకిల్ అపహరించిన కేసులో ఆకివీడుకు చెందిన కె.ఏసు అనే వ్యక్తికి 9 నెలల జైలు శిక్ష విధిస్తూ భీమవరం 2వ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పు చెప్పారని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మరో కేసులో ఒక మహిళ నుంచి 2 కాసుల బంగారాన్ని అపహరించిన నేపథ్యంలో నర్సింహపురానికి చెందిన ఎం.వెంకన్న అనే వ్యక్తికి 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ భీమవరం 2వ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పు చెప్పారని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై పి.అప్పారావు కేసు దర్యాప్తు చేశారు.


ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయాలి

నరసాపురం: పట్టణంలోని అన్ని ప్రధాన డ్రైయిన్స్‌ను ఈ వేసవిలో శుభ్రం చేయాలని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. పట్టణంలోని 23వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డుల్లో డ్రెయిన్స్, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. వీధి లైట్లు ఎలా వెలుగుతున్నాయి, మంచినీటి సరఫరాలో ఏమైనా లోపాలు ఉన్నాయా? అన్న అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ డ్రెయిన్స్‌ను శుభ్రం చేసి బయలకు తీసిన వ్యర్థాన్ని వెంటనే అక్కడ నుంచి తొలగించాలని చెప్పారు. లేదంటే పారిశుద్ధ్య ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ కావలి రామసీత, కావలి నాని పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో వెలసిన కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం రాత్రి అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. 21వ వార్షికోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ అన్న సమారాధనలో సుమారు 1500 మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఈ నెల 1న ప్రారంభమైన ఉత్సవాలు పది రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి నిత్య కుంకుమ పూజలు, జాతర, ప్రత్యేక పూల రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కానుకలు, చలివిడి, పానకాల కావిడిలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాయకుదురులో ఆయుర్వేద వైద్య సేవలు



శిబిరంలో వైద్య పరీక్ష చేస్తున్న దృశ్యం

వీరవాసరం: ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాఖ ఆధ్వర్యంలో రాయకుదురు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల బాగును చూస్తూ, ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని వివరించారు. సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యాధికారి టి.రామచందర్, ఎన్‌వీఎస్ మూర్తి, గ్రామ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'

- పిల్లలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణ
- తణుకు నియోజకవర్గంలో 1482 మంది గర్భిణులు, 1413 మంది బాలింతలకు లబ్ధి



ఇరగవరంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

ఇరగవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది. పేదరికంతో గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతుండడాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. రెండేళ్ల కిందట వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలులోకి తెచ్చింది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతోంది. ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు. ఈ పథకంలో గర్భిణిగా నమోదయినప్పటి నుంచీ ప్రసవానంతరం ఆరు నెలలు పాటు ఆరు రకాల పౌష్టికాహార కిట్ అందిస్తున్నారు. వీటితో పాటు పోషక విలువలతో కూడిన భోజనం మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజూ కోడి గుడ్డు, వారానికి లీటరు పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో తణుకు నియోజకవర్గంలో 1,482 మంది గర్భిణులు, 1,413 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు.

గర్భిణులకు 'సంపూర్ణ పోషణ'

గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోంది. కిలో రాగిపిండి, కిలో అటుకులు, పావు కిలో వేరుశనగ చిక్కీ, కిలో జొన్నపిండి, పావు కిలో బెల్లం, పావు కిలో ఎండు ఖర్జూరం, మూడు కిలోల ఫోర్టిఫైడ్ రైస్, అరకిలో నూనె, అర కిలో పప్పు, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో కూడిన కిట్లను అందిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యం కోసం..

ఏడు నుంచి మూడేళ్ల వయస్సుగల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలమృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను ప్రభుత్వం సమకూర్చుతోంది. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వండి వడ్డిస్తోంది.

ఆరోగ్యం మెరుగు పడింది



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రతి నెలా ఇస్తోన్న సంపూర్ణ పోషణ కిట్లు సక్రమంగా అందుతున్నాయి. వీటితో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తినడం వల్ల నా ఆరోగ్యం మెరుగుపడింది. ఈ కిట్లను నాతో పాటు గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– కర్రి సాయి లక్ష్మి, గర్భిణి, తూర్పువిప్పర్రు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం మంచి ఉద్దేశంతో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సరఫరా చేస్తుంది. వీటిని అర్హులు అందరికీ సక్రమంగా అందజేస్తున్నాం. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. వీటి వినియోగం పై అంగన్‌వాడీ కేంద్రల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.ఆశ రోహిణి, అడిషనల్ సీడీపీఓ, తణుకు

డివిజన్ల ఏర్పాటు చరిత్రాత్మకం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలో నల్లజర్ల–కోడేరు రోడ్డుగా ఉన్న మార్గాన్ని వైఎస్సార్ మార్గ్‌గా నామకరణం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర రహదారిని వైఎస్సార్ మార్గ్‌గా మారుస్తున్నామన్నారు. దీంతోపాటు తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్లు ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమన్నారు. తమ స్థాయికి దిగజారి కొందరు నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు కనువిప్పు చేసుకోవాలని హితవు పలికారు. రెవెన్యూ, పోలీస్ డివిజన్లు ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి పట్టణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలన పనులపై ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్ళాల్సిన శ్రమ తప్పుతుందన్నారు. ఇరిగేషన్ ఈఈ కార్యాలయంతోపాటు వివిధ విభాగాల కార్యాలయాలను పట్టణంలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి అందించిన సహకారం మరువలేనిదన్నారు. వైఎస్సార్ పట్ల కృతజ్ఞతగా వైఎస్సార్ మార్గ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పెంటపాడు మిడ్ లెవెల్ కాలువ వద్ద నుంచి వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ వరకు రూ.26 కోట్లతో నాలుగు లైన్ల రహదారిని నిర్మించామన్నారు. అదేవిధంగా 68 కిలో మీటరు నుంచి 72 కిలో మీటరు వరకు మరో నాలుగు కిలోమీటర్లు నాలుగులైన్ల రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. రహదారికి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని కొట్టు తెలిపారు. పట్టణ పరిధిలో రూ.15 కోట్ల వ్యయంతో వైఎస్సార్ మార్గ్‌ను బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. దిగజారుడు విమర్శలు చేసేవారి పట్ల తాను ఎన్నడూ స్పందించనని నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. కర్రి భాస్కరరావు, సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, వెలిశెట్టి నరేంద్ర, కొట్టు విశాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల ఐక్యతకు కృషి చేసిన పీవీరావు



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత పీవీరావు తన ఉద్యోగాన్ని కూడా లెక్క చేయకుండా ఎస్సీల ఐక్యత కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. స్థానిక పోలీస్ ఐలాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీరావు 74వ జయంతి నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పీవీరావు అంబేడ్కర్ భావజాలంతో పెరిగారని, ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు చేశారని వివరించారు. ఎస్సీల మధ్య చిచ్చు పెట్టడానికి తన రాజకీయ ప్రయోజనాల కోసం మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మందకృష్ణ అనే దుష్టశక్తిని తీసుకొచ్చి ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నిస్తున్న సమయంలో పీవీరావు తన ఉద్యోగాన్ని కూడా లెక్క చేయలేదని, ఎస్సీల ఐక్యత కోసం కృషి చేశారని గుర్తుచేశారు. పీవీరావు ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. ఎస్సీలకు అన్ని విధాలుగా పెద్దపీట వేస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని మంగరాజు కోరారు. సమావేశంలో బాలకృష్ణ, మధు, సునీల్, సందీప్, అనిల్ పాల్గొన్నారు.

ఆసక్తిగా వేసవి విజ్ఞాన తరగతులు



ప్రథమ శ్రేణి శాఖా గంథాలయంలో తరగతులకు హాజరైన విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన తరగతులు స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గంథాలయంలో ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడో రోజు బుధవారం పలు పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, లెక్కలు, సోషల్, సైన్స్, పజిల్స్, ఆట పాటలు, దేశభక్తి, ప్రబోధాత్మక గేయాలు నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాశివభట్లు లక్ష్మణరాజు, అనంతపల్లి జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, సంజులు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన చేశారు.

శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పించడం, భగవద్గీత, వేమన పద్యాలను చదివించారు. రిటైర్డు ఉపాధ్యాయుడు వి.లక్ష్మణరావు, కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, ఎ.బాలాజీ, శేష వేంద్రరావు, గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు చదివించారు. మ్యూజికల్ చైర్స్ ఆడించారు. గ్రంథాలయాధికారి ఎస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పిద్దాం



యాగర్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్పిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకట లక్ష్మణరావు హెల్త్ సిబ్బందికి సూచించారు. స్థానిక యాగర్లపల్లి డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 19, 20 వార్డుల్లో బుధవారం వైద్య ఉద్యోగుల బృందం పర్యటించింది. వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజారోగ్యం పరిరక్షణ కోసం ఫీవర్ సర్వేలు, డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాలను పరిశీలిస్తూ దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పనికిరాని చెత్త చెదారాలను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని అన్నారు. ఆశాలకు, అంగన్‌వాడీలకు, వలంటీర్లుకు పలు సూచనలు చేశారు. ఆరోగ్య సహాయకులు, కార్యకర్తలు కాంతారావు, సుబ్బలక్ష్మి, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరాడాలి



ఇటుకులగుంటలో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వంపై పోరాడి ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంట గ్రామంలో ఉపాధి హామీ పరిరక్షణ ఆటో ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కార్మికుల సమస్యలపై ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెం, చినతాడేపల్లి, కడియద్ద, జగ్గన్నపేట,న వెంకట్రామన్నగూడెం, జగన్నాథపురం, నవాబుపాలెం, నందమూరు, మారంపల్లి గ్రామాల్లో ప్రచార యాత్ర కొనసాగింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ, మాగంటి చింతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 13న శనివారం నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ గురువారం బైక్ ర్యాలీ చేయనున్నట్టు అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, జనరల్ సెక్రటరీ డి.సునీల్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కోర్టు ఆవరణ నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు నిర్వహించే ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, సీనియర్ న్యాయవాదులు పాల్గొంటారని వివరించారు.

13న జాతీయ లోక్ అదాలత్

తణుకు అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఈనెల 13న తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తణుకు ఇన్‌చార్జి నాలుగో అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీకాదగ్గ క్రిమినల్, అన్ని రకాల సివిల్, మోటారు వాహన ప్రమాద కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ ఈ సదవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

విశాఖ విహారయాత్రకు స్పెషల్ బస్సులు

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపో నుంచి విశాఖ విహార యాత్రకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజరు పీఎన్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు తణుకులో బయలుదేరి ఆదివారం ఉదయం విశాఖలోని సుప్రసిద్ధ సందర్శనీయ ప్రాంతాలైన సింహాచలం, కైలాసగిరి, ఉడాపార్కు, నేవీ మ్యూజియం, సబ్ మెరైన్, ఆర్‌కే బీచ్, కాళీ మాత టెంపుల్ అనంతరం సందర్శన అనంతరం బయలుదేరి సోమవారం ఉదయం తణుకు చేరుకుంటుందని వివరించారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో పెద్దలకు రూ.1020, పిల్లలకు రూ.770, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో పెద్దలకు రూ.980, పిల్లలకు రూ.740 టికెట్ ధరలు నిర్దేశించినట్టు చెప్పారు. వేసవికాలం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ స్పెషల్ బస్సులకు సంబంధించి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని, వివరాలకు ఫోన్ నెంబర్లు 73829 00133, 98491 69396లో సంప్రదించాలని కోరారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

సాక్షి, భీమవరం: జిల్లాలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 25 వేలు పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం భీమవరం యుటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నర్సింహమూర్తి అధ్యక్షతన నిర్వహించారు.

మండుతోన్న ఎండలు



ప్రయాణికుల్లేని ప్రత్తిపాడు వద్ద హైవే



12 గంటలకు గూడెం పోలీస్ ఐలండ్ సెంటర్ ఇలా..

- 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అల్లాడిపోతున్న ప్రజలు

పెంటపాడు: వేసవి తీవ్రత పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణం చల్లబడిందనుకున్నంతలోనే భానుడు మరింత భగభగలాడుతున్నాడు. గత నాలుగు రోజుల నుంచి ఎండతోపాటు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఉదయం 7 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 10 గంటలకే రోడ్లపై ప్రాయణికుల్లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాలేని పరిస్థితి నెలకింది. ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణికులు ఎండ తీవ్రత సమయంలో రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలు నిలిపివేసి సేదదీరుతున్నారు. ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరపనులపై బయటకు వచ్చేవారు ఎండనుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వినియోగిస్తున్నారు. ఎండల తీవ్రతకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జ్యూస్‌సెంటర్లు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరందుకున్నాయి.

వడగాలులతో జాగ్రత్త



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వడగాల్పులు వీస్తున్నాయి. మే నెలాఖరు నాటికి ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండల్లో పనిచేసేవారికి, తిరిగేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి గుడ్డతో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓవర్‌రీహైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ తోట రాజేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెంటపాడు

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

వీరవాసరం: రైతులు వద్ద నుంచి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డిఓ దాసిరాజు తెలిపారు. వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ రైతు సమస్యల పట్ల తక్షణ స్పందించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అడిగిన వెంటనే గోనె సంచులను ఏర్పాటు చేయాలని వివరించారు.సమావేశంలో తహసీల్దార్ ఎం.సుందర్ రాజు, మండల వ్యవసాయ అధికారి ఎస్.గీతాదేవి పాల్గొన్నారు

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

భీమవరం అర్బన్: దాళ్వా మాసూళ్లలో ఒబ్బిడైన ధాన్యాన్ని దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఆర్‌బీకే సెంటర్లలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో 8 వేల 300 ఎకరాలలో దాళ్వా సాగు చేపట్టగా ఇప్పటివరకు సుమారు 5 వేల ఎకరాలలో ధాన్యం మాసూళ్లు జరిగాయన్నారు. 4వేల 500 ఎకరాలకు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. మిగిలిన రైతులు త్వరగా మాసూళ్లు చేసి ఒబ్బిడైన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలన్నారు.

కోరుకొల్లులో చోరీ

పాలకోడేరు: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బంగారం నగదు అపహరించకపోయారని గణేష్ మోహన్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోరుకొల్లు గ్రామానికి చెందిన గణేష్ మోహన్ సింగ్ దంపతులిద్దరూ బుధవారం ఇంటికి తాళం వేసి భీమవరం వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం బద్దలు కొట్టి తలుపులు తీసినట్లు గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని మూడు పేటలు బంగారం గొలుసు (నవరలు), చెవి దిద్దులు, రెండు బంగారు బిల్లలు, (రూపులు) గుర్తుతెలియని దండగలు దోచుకుపోయారు. మరొక అర ఓపెన్ కాకపోవడంతో అందులోను వస్తువులు అలానే ఉన్నాయి. కొంత నగదు మాత్రం అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.